క్లుప్తంగా

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ఎర్నిమాంబ అమ్మవారికి హారతిస్తున్న పూజారి వాసుపల్లి విజయమ్మ

కంచరపాలెం: జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఏకాదశి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని అలంకరించి పూజలు చేశారు. ఆలయ అర్చకులు శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వసతుల కల్పనకు ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు విస్తరించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రతినిధులు

తాటిచెట్లపాలెం : స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు దశదిశలా విస్తరింపచేయాలని, విద్యార్థులంతా భాగస్వాములు కావాలని స్కౌట్స్ అండ్ గైడ్స్ విశాఖ జిల్లా కార్యదర్శి దాసరి వేణుగోపాల్ కోరారు. జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా ఈ నెల 31న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, అబ్దుల్ కలామ్ యూ ఆర్ గ్రేట్ ఓపెన్ టీం, మదర్ థెరీసా ఓపెన్ రేంజర్ టీం ఆధ్వర్యంలో ఉచితంగా భోజనం పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను ఆదివారం తాటిచెట్లపాలెంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ మారుతి షరీఫ్ కుమార్, ఏఎస్‌వోసీ అహ్మద్ షరీఫ్, ట్రైనింగ్ కౌన్సిలర్ గుండి జానకిరాము, గైడ్ కెప్టెన్ పి.వాణి, రేంజర్ లీడర్ నజ్మా భాను, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మ్యూజియంగా ప్రకటించాలి



మాట్లాడుతున్న కొత్తపల్లి వెంకటరమణ

సీతంపేట : రుషికొండలో గల భవనాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మ్యూజియంగా ప్రకటించాలని నవయానం బహుజన హక్కుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. రామాటాకీస్ రోడ్డులో గల అంబేద్కర్ భవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బౌద్ధ, జైన ధర్మానికి సంబంధించిన శిల్పాలు, అవశేషాలు ఎన్నో లభించాయన్నారు. వాటితో పాటు ఉత్తరాంధ్రలోని బౌద్ధ చారిత్రక అవశేషాలను రుషికొండ భవనాల్లో భద్రపర్చాలని కోరారు. సంఘం అధ్యక్షుడు ఎన్.ధర్మశాలి, ఉపాధ్యక్షుడు ఎం.మల్లయ్యరాజు, జర్జాన సుదర్శనం, సంయుక్త కార్యదర్శి ఎస్.ఎ.రావు, జోసెల వాసు, అల్లు అప్పారావు పాల్గొన్నారు.

వేడుకగా పుస్తకావిష్కరణ

మహారాణిపేట: డాక్టర్ కె.సుహాసిని ఆనంద్ రచించిన డాక్టర్ సాలూరు రాజేశ్వరరావు సినీ సంగీత సౌరభం పుస్తకాన్ని విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. జిల్లా పరిషత్ సమీపంలో ఉన్న అంకోశా ఆడిటోరియంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తొలుత డాక్టర్ సాలూరు రాజేశ్వరరావు సంగీత విభావరి కార్యక్రమం పలువురుని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి సెంచూరియన్ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య జీఎస్ఎన్ రాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విశాఖ రసజ్ఞ వేదిక అధ్యక్షుడు డాక్టర్ జి. రఘు రామారావు, అంకోశా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.కె. ఈ.అప్పారావు, కార్యదర్శి డాక్టర్ పీవీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు పోతున్నాయ్!

- నియోజకవర్గంలోని కీలక కూడళ్లలో ప్రమాదాలు
- రాత్రిపూట ఇష్టారాజ్యంగా రాంగ్‌రూట్‌లో ప్రయాణాలు
- జంక్షన్లలో కనిపించని పోలీస్ గస్తీ



ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ప్రమాదంలో చనిపోయిన మహిళ మృతదేహం వద్ద పోలీసులు



ప్రమాదాలకు నిలయంగా మారిన సత్యం జంక్షన్

సీతమ్మధార : నియోజకవర్గంలోని పలు జంక్షన్లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ద్వారకా జోన్, ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సత్యం జంక్షన్, తాటిచెట్లపాలెం, గురుద్వార్ జంక్షన్లలో ఏదో ఒక చోట నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగానే జరిగిన ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. సత్యం జంక్షన్ వద్ద గల జాతీయ రహదారి మీదుగా రోజూ వేల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, బస్సులు, లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. కోల్‌కతా నుంచి చెన్నై రాకపోకలు సాగించే భారీ వాహనాలు కూడా ఇటుగానే వస్తుంటాయి. సీతమ్మధార నుంచి రామాటాకీస్ వెళ్లడానికి, మద్దిలపాలెం నుంచి గురుద్వారాకు వెళ్లేందుకు ఇదే దారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ముఖ్యంగా నాలుగు రోడ్ల జంక్షన్ కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ మార్గంలో 540, 541, 111, 222వీ, 69తోపాటు పలు ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తాయి. రాత్రిపూట సిగ్నల్స్ ఆపేసిన తర్వాత ఈ కూడలిలో ట్రాఫిక్ పోలీసులు కనిపించడం లేదు. దీంతో ఈ జంక్షన్‌లో పోలీసులు తగిన రోడ్డు భద్రతా చర్యలు చేపట్టకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. విశాలమైన రోడ్లు కావడంతో భారీ వాహనాలు, కార్లు, బైక్‌లతో వేగంగా దూసుకొచ్చి ప్రమాదాలకు గురవుతున్నారు.

కనీస ట్రాఫిక్ చర్యలు శూన్యం

నియోజకవర్గంలోని కూడళ్లలో ఎన్ని ప్రమాదాలు జరుగుతున్నా పోలీసులు ఈ రోడ్డుపై ట్రాఫిక్ చర్యలు చేపట్టడం లేదు. విశాలమైన ఆయా కూడళ్ల వద్ద ట్రాఫిక్ పోలీసులు భద్రతా చర్యలు చేపట్టడం లేదు. ఏదో ఒక లైన్‌లో వెళ్లి ఎదురుగా వచ్చిన వాహనాలను ఢీకొనడం, మితిమీరిన వేగంతో వెళ్లి అదుపుతప్పి డివైడర్ల మీదుకు దూసుకుపోవడం, తదితర కారణాలతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఆయా జంక్షన్ల వద్ద ఫ్రీ లెఫ్ట్ మార్గాల్లో స్టాపర్ బోర్డులు మచ్చుకైనా కనిపించడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గురుద్వారా జంక్షన్ వద్ద రాంగ్‌రూట్‌లో వచ్చే ఆకతాయిల వల్ల కూడా తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. గ్రీన్ సిగ్నల్ ఉన్నపుడు సైతం పలువురు పాదచారులు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి వేళ 9 గంటల తర్వాత కూడలిలో కానిస్టేబుల్‌ను నియమించాలని స్థానికులు కోరుతున్నారు. తరుచూ జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని పోలీసులు వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

80 ప్రమాదాల్లో 13 మంది మృతి

ఈస్ట్ సర్కిల్‌లోని ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఏడాది ఇప్పటి వరకు మొత్తం 80 ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో 13 మంది చనిపోయారు. ద్వారకా స్టేషన్ పరిధిలో పది ప్రమాదాలు జరగ్గా నలుగురు చనిపోయారు, మిగిలిన వారు గాయపడ్డారు. గురుద్వారా జంక్షన్ వద్ద కూడా తరచూ ప్రమాదాలు జరగడం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవలే రైల్వేస్టేషన్ రోడ్డులో ఆటో బోల్తాపడి డ్రైవర్ అక్కడికక్కడే చనిపోయాడు. సత్యం జంక్షన్‌లో ఇటీవలే రాంగ్‌రూట్‌లో వచ్చిన కారు ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు గాయపడ్డాడు. గురుద్వారా జంక్షన్ వద్ద కొద్ది నెలల క్రితం బస్సు అదుపు తప్పి సిగ్నల్ లైట్లను ఢీకొని బోల్తాపడిన విషయం తెలిసిందే.

సబ్ కంట్రోల్ పాయింట్ ఉన్నా...

గురుద్వారా జంక్షన్ వద్ద సబ్ కంట్రోల్ పాయింట్ ఉన్నా ప్రయోజనం శూన్యమేనని వాహన చోదకులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ సిబ్బంది ఎప్పుడు వస్తారో... ఎప్పుడు వెళ్లిపోతారో తెలియని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఒకవేళ సిబ్బంది ఉన్నా సరే... బస్‌షెల్టర్ వద్దనే ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు పార్కింగ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



సత్యం జంక్షన్ వద్ద ప్రమాదానికి గురైన కారు (ఫైల్)

తరచూ ప్రమాదాలతో ఆందోళన

ఫోర్త్‌టౌన్, ద్వారకా పోలీస్ స్టేషన్ల పరిధిలో తరచూ రోడ్డు ప్రమాదాల్లో వాహన చోదకులు చనిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా జాతీయ రహదారిపై నిత్యం చిన్నా, పెద్దా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ట్రాఫిక్ పోలీసుల కొరత కూడా ప్రమాదాలకు కారణమవుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి.

– అప్పలనాయుడు, గురుద్వారా

ప్రమాదాల నివారణకు చర్యలు

ఈస్ట్ జోన్ పరిధిలోని కీలక జంక్షన్ల వద్ద రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నాం. రోడ్లపై సెఫ్టీ సిబ్బందిని కూడా అప్రమత్తం చేశాం. ప్రమాదాలు జరగకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నాం. వాహనదారులు కూడా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. మితిమీరిన వేగంతో రాంగ్ రూట్‌లో ప్రయాణాలు చేయరాదు.

–అమ్మినాయుడు, సీఐ, ఈస్ట్ జోన్ (ట్రాఫిక్)

అన్నం పరబ్రహ్మ స్వరూపం



అన్నదానం చేస్తున్న ఎంవీ రాజశేఖర్

సీతంపేట : స్థానిక అక్కయ్యపాలెం వాగ్దేవి పాఠశాల ఆవరణలో గత 13 సంవత్సరాలుగా ప్రతీ ఆదివారం అన్నసమారాధన నిర్వహిస్తున్న ఎం.వి.వి.సత్యనారాయణ, జి.బ్రహ్మానందకుమార్ అభినందనీయులని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ అన్నారు. ఆదివారం నారాయణ సేవను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపమని, నారాయణ సేవ పేరుతో అన్నార్తులు, నిరుపేదల ఆకలి తీర్చడం దైవకార్యంతో సమానమన్నారు. 13 ఏళ్లుగా ప్రతీ ఆదివారం ఎక్కడికీ వెళ్లకుండా అన్నదానం చేయడం చాలా గొప్ప విషయమని కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ద్వారకానగర్ కార్యదర్శి పి.జి.ప్రసాదరావు, బి.హనుమంతరావు, ఎ.వెంకటరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు పరామర్శ



విష్ణుకుమార్‌రాజును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

సీతమ్మధార : ఎమ్మెల్యే పెనుమత్స విష్ణుకుమార్‌రాజు కాలికి గాయం కావడంతో వైద్యులు కొద్ది రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించడంతో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదివారం పరామర్శించారు. సీతమ్మధార, బాలయ్యశాస్త్రి లే అవుట్‌లోని ఎమ్మెల్యే నివాసానికి వచ్చి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని కోరారు.

ప్రతి ఇంటి మీద మిద్దె తోటలు పెంచాలి



మద్రిపాలెంలో మిద్దె తోటలో మహిళలు

మద్రిపాలెం : ప్రతి ఇంటి మీద మిద్దె తోటలు పెంచాలని వనమాలి, సీటీజీ సంస్థలు ఆదివారం పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాయి. ఇందులో భాగంగా మద్రిపాలెంలో గ్రీన్ క్లైమేట్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం ఎకో వైజాగ్‌లో భాగంగా ఆకుకూరల విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థల ప్రతినిధులు అరవల అరుణ, మళ్ల సరిత, నాదెళ్ల జ్యోతి మాట్లాడుతూ ప్రతీ నెలా నగరంలోని పలు ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రసాయనిక ఎరువులు, పురుగు మందులు, కలుపుతీత మందులతో పండిస్తున్న ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు వల్ల అనారోగ్యం కలుగుతుందని హెచ్చరించారు. ఉత్తర నియోజకవర్గం పరిధిలోని మద్రిపాలెం, మురళీనగర్ తదితర ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇంటి మీద మిద్దె తోటలు పెంపకం వివరాల కోసం 77949 30439, 85008 74103లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎకో విజనరీ పర్యావరణ సంస్థ ప్రతినిధులు జి.దనూష, డి.పూజిత, కె.మేఘన, కె.ఎల్.దీపిక, కె.కుసుమ, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

రౌడీయిజం చేస్తే పీడీ యాక్ట్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ విజయ్‌కుమార్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ద్వారకా పోలీస్ స్టేషన్ సీఐ డీవీ రమణ

సీతమ్మధార : రౌడీయిజం చేస్తే పీడీ యాక్ట్ అమలు చేస్తామని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ద్వారకా పోలీస్ స్టేషన్ సీఐ డి.వి.రమణ హెచ్చరించారు. అందరూ సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఈ మేరకు ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులతో సంబంధం ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. వారి వేలిముద్రలతోపాటు సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు రౌడీషీటర్లపై నిఘా పెంచామన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, గొడవలు, బెదిరింపులకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ ధర్మేంద్ర, ఏఎస్ఐ డి.వి.రత్నం, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

- రౌడీషీటర్లు సమాజంలో అల్లర్లు, గొడవలు సృష్టించకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలని ఫోర్త్‌టౌన్ సీఐ ఎస్.విజయకుమార్ సూచించారు. ఈ మేరకు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా వారి రోజువారీ కార్యకలాపాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎస్ఐ జి.వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన పేరడీ సాంగ్స్



కార్యక్రమంలో పాల్గొన్న గాయనీ గాయకులు

సీతంపేట : పేరడీ గారడీ పేరిట ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమం నవ్వులు విరబూయించింది. రచయిత, నటులు తాళాభక్తుల లక్ష్మీ ప్రసాద్ రచించిన 30 పేరడీ సాంగ్స్‌ను స్వరరంజని గాయనీ గాయకులు ఆలపించి ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తారు. లతారాములు పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమానికి గిన్నిస్ వరల్డ్ రికార్డు హోల్డర్ కోరుకొండ రంగారావు వ్యాఖ్యానం చేశారు. ఫిల్మ్ డైరెక్టర్ రెడ్డెం యాదకుమార్, మేడా మస్తాన్‌రెడ్డి మాట్లాడుతూ సినిమా పాటలకు పేరడీ రాయడం చాలా కష్టతరమని, లక్ష్మీ ప్రసాద్ హాస్యాన్ని రంగరించి, అదే ట్యూన్‌లో అద్భుతంగా రాశారన్నారు. బాగా పాడిన గాయనీ గాయకులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జి.వి.త్రినాథ్, యోగా భాస్కర్, పి.వి.పద్మిని, లక్ష్మీ రెడ్డి, ఎంవీఆర్ నాగేశ్వరరావు, రూపవాణి, దుర్గా ప్రసన్న, స్వరరంజని సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న తృతీయ సోపాన్ శిక్షణ



తాళ్లు, కర్రల ఉపయోగం తెలియజేస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్

తాటిచెట్లపాలెం : తాటిచెట్లపాలెంలో గల కేంద్రీయ విద్యాలయలో శనివారం ప్రారంభమైన స్కౌట్స్ అండ్ గైడ్స్ తృతీయ సోపాన్ శిక్షణలో భాగంగా రెండో రోజు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం ఫ్లాగ్ బ్రేకింగ్, ముళ్లు, కర్రల ఉపయోగాలు వివరించారు. సాయంత్రం కేంప్ ఫైర్ నిర్వహించారు. ఈ కేంప్ ఫైర్‌ను ఏఎల్‌టీ కేఆర్ జగన్నాథ్ ప్రారంభించగా, ఆయా కేంద్రీయ విద్యాలయాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కమల్‌జీత్, లీడర్ ఆఫ్ కేంప్ రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

గుండె ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం



వాకర్స్ పార్కులో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

మురళీనగర్ : జీవనాడి గుండె ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రవికాంత్ సూచించారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అపోలో హాస్పిటల్స్ సహకారంతో వాకర్స్ పార్కులో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొని గుండె ఆరోగ్యానికి సంబంధించి పలు సూచనలు చేశారు. కొవ్వు, నూనె ఎక్కువగా ఉన్న ఆహారాన్ని తగ్గించాలన్నారు. రోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయడం ద్వారా గుండె ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ధూమపానం, ఆల్కహాల్ తీసుకోవడం తగ్గించాలని సూచించారు. అధిక బరువు గుండె సమస్యలకు ప్రధాన కారణమవుతుందని, శరీర బరువును నియంత్రణలో ఉంచాలన్నారు. డాక్టర్ ధీరజ్ పత్రి మాట్లాడుతూ ఆహార నియంత్రణ పాటించాలన్నారు. వైద్య శిబిరంలో 184 మందికి పరీక్షలు, 104 మందికి ఈసీజీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి పర్యవేక్షణలో నిర్వహించిన శిబిరంలో వైద్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జె.కూర్మారావు, ప్రసాదరావు, ఎన్.ప్రకాశరావు, ఎన్.బుచ్చయ్య, రాళ్లపల్లి సత్యనాథం, కె.ద్వారకానాథ్, కార్యవర్గ సభ్యులు విజయలక్ష్మి, ఎస్.రామ్మోహన్‌రావు, ఆర్.నాగేశ్వరరావు, టి.వి.రమణ, పి.శ్రీనివాసరావు, వై.దేముడు, వైశాఖి స్పోర్ట్సు పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ పాల్గొని శిబిరం నిర్వహణకు సహకరించారు.

మాలధారులకు నిత్యాన్నదానం ప్రారంభం



కొత్త వెంకోజీపాలెంలో అన్నప్రసాదం వడ్డిస్తున్న గ్రామ సేవా సంఘం సభ్యులు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు కొత్త వెంకోజీపాలెంలోని గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతీ ఏటా మాదిరిగా ఆదివారం మాలధారులకు నిత్యాన్నదానం ప్రారంభించారు. ధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయం వద్ద సంఘ అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు స్వాములకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు పీలా కనకరాజు మాట్లాడుతూ 8 ఏళ్లుగా స్వాములకు నిత్యాన్నదానం కొనసాగిస్తున్నామని తెలిపారు. దాతల సాయంతో ప్రతి రోజు మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు 41 రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. మాలధారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కాళ్ల పోలినాయుడు, ఉపాధ్యక్షుడు పీలా నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు మద్దాల వీరవెంకట అప్పారావు, ఆడిటర్ లోకేష్, ఆలయ కమిటీ సభ్యులు ఎస్.నరసింహారెడ్డి, కాళ్ల వరహాలు, సాంబ, మద్దాల నరసింగరావు, అప్పలరాజు, ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్ శర్మ, సుబ్రహ్మణ్య శాస్త్రి, బాల భాస్కరశర్మ పాల్గొన్నారు.

మానవ హక్కుల కౌన్సిల్ ఆత్మీయ సమ్మేళనం

మద్దిలపాలెం: మానవ హక్కుల కౌన్సిల్ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మద్దిలపాలెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులు ఆటపాటలతో అలరించారు. సంస్థ కార్యవర్గ సభ్యుడు ఎస్వీ రమణ నిర్వహణలో ముఖ్య అతిథి కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాం ప్రసాద్ వేడుకలు ప్రారంభించారు. ఆయన ప్రసంగిస్తూ మానవ హక్కుల పరిరక్షణకు నిత్యం కృషి చేస్తున్న హ్యూమన్ రైట్స్ డిపెండెర్స్ మానసిక ఉల్లాసం కోసం ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఉత్సాహాన్ని పెంపొందించామని తెలిపారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల అందజేత



విద్యార్థులతో ఎల్ ఏంజిల్స్ ప్రతినిధులు

సీతమ్మధార: జపాన్‌కు చెందిన ఎల్ ఏంజిల్స్ వలంటీర్స్ అసోషియేషన్, రోటరీ క్లబ్ విశాఖ వ్యాలీతో కలిసి 30 మంది ప్రతిభ గల పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో చదవుతూ 85 శాతానికి పైగా మార్కులు సాధించిన ప్రతిభ గల విద్యార్థులను ఇందుకు ఎంపిక చేశారు. ఆదివారం ఆశీలమెట్టలోని ఒక హోటల్లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రోటరీ 3020 పూర్వ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్.కె.జైన్ పాల్గొని విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఏటా 30 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేసేందుకు వీలుగా నిధులు ఏర్పాటు చేసిన ఎల్ ఏంజిల్ ఇంటర్నేషనల్ వలంటీర్స్ అసోషియేషన్ (లైవా) ఇంటర్నేషనల్ కో–ఆర్డినేటర్, రోటరీ క్లబ్ విశాఖ వ్యాలీ సీనియర్ రొటేరియన్ మండ వెంకట జానకిరామ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు ఎస్.హనుమంతరావు, బి.బాబ్జి, జి.పాండురంగరాజు తదితరులు పాల్గొన్నారు.


వృక్షజాతుల సంరక్షణ అవసరం



శాస్త్రవేత్త ఎస్.ఎస్.దాస్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

మద్దిలపాలెం: వృక్షజాతుల సంరక్షణతోనే పర్యావరణాన్ని పరిరక్షించగలమని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'తూర్పు కనుమల్లోని స్థానిక వృక్షజాతుల పరిరక్షణ' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్థానిక వృక్షజాతులను సంరక్షించడం ఎంతో అవసరమన్నారు. అణుబాంబుల వల్ల పర్యావరణానికి జరిగిన నష్టాన్ని వివరించారు. బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా కోల్‌కతా శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.ఎస్.దాస్ మాట్లాడుతూ సంగీతానికి సైతం స్పందించే గుణం మొక్కలకు ఉందని ఇటీవల పరిశోధనలు స్పష్టం చేశాయన్నారు. ప్రకృతితో కలిసి ప్రయాణించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. శాస్త్ర సంబంధమైన జ్ఞానాన్ని సేకరించడం, సరిచూసుకోవడం, దానిని భద్రపరచడం ఎంతో అవసరమన్నారు. సదస్సు కన్వీనర్ ఆచార్య ఎస్.బి.పడాల్ మాట్లాడుతూ ఏయూ బొటానికల్ గార్డెన్‌లో 30కి పైగా అరుదైన జాతులను సంరక్షిస్తున్నామని తెలిపారు. తూర్పు కనుమల ప్రత్యేకతలు, సదస్సు విశిష్టతను వివరించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు మాట్లాడుతూ మైనింగ్, టూరిజం, అడవులను ఆక్రమించడం వంటి చర్యల ఫలితంగా అటవీ విస్తీర్ణం తగ్గిపోతూ సహజ వృక్షజాతులు దెబ్బతింటున్నాయన్నారు. అటవీ శాఖ ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలను రూపొందించి నిర్వహించాల్సిన విధానాన్ని తెలియజేశారు.

మద్యం దుకాణాన్ని వ్యతిరేకిస్తూ వంటావార్పు



వంటావార్పు ద్వారా నిరసన తెలుపుతున్న పందిమెట్ట ప్రాంత వాసులు

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు దసపల్లా హిల్స్ దరి పందిమెట్ట ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆదివారం రోడ్డుపై స్థానికులు వంటావార్పు నిర్వహించారు. ఐద్వా నాయకురాలు కె.మణి మాట్లాడుతూ తమ ప్రాంతంలో నిబంధనలకు వ్యతిరేకంగా వైన్ షాప్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. మా గ్రామ దేవత ఆలయం పక్కనే మద్యం దుకాణం పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. మా ప్రాంతంలో దుకాణం అనుమతులను రద్దు చేసే వరకు తమ నిరసన కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.